క్లుప్తంగా

వన సంపదను రక్షిద్దాం

కాణిపాకం: భవిష్యత్ తరాల దృష్ట్యా విరివిగా మొక్కలు నాటి వన సంపదను సృష్టించి.. వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


పెద్దిశెట్టిపల్లెలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: గర్భిణులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య తెలిపారు. పెద్దిశెట్టిపల్లె సచివాలయంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందజేశారు. అంగన్‌వాడీల ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. బాలింతల పిల్లలకు టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. అనంతరం మధుమేహం, బీపీలతో వివిధ రోగాలకు సంబంధించి చికిత్సలు చేసి మందులు, మాత్రలను అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాలలో..


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఐరాల: గర్భిణులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. శనివారం మండలంలోని పీ.కట్టకిందపల్లె, పీ.యల్లంపల్లె గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మోదీ కులంపై అసత్య ప్రచారం

చిత్తూరు కార్పొరేషన్: ప్రధాని నరేంద్రమోదీ కులంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ నాయకులు శ్రీనివాసులు మండిపడ్డారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మోదీ సామాజిక వర్గాన్ని 1999లోనే ఓబీసీగా గుర్తించారన్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాకే మోదీ తన కులాన్ని ఓబీసీగా ప్రకటించుకున్నారనే వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు.

నో టెన్షన్..

- రెండేళ్ల కిందట సమూల మార్పులు తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- గతంలో 11 పేపర్లు.. 11 రోజుల పాటు పరీక్షలు
- నేడు సులువుగా చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు
- ఇప్పుడు 6 సబ్జెక్టులు..7 పేపర్లు
- ఒక్కో పేపరుకు వందమార్కులు
- విద్యార్థులపై తగ్గిన భారం
- గుడిపాలలో టెన్త్ 301 మంది విద్యార్థులు
- మార్చి 17 నుంచి పది పరీక్షలు

విద్యావిధానంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక సంస్కరణలు నేడు విద్యార్థులకు ఉపయుక్తంగా మారాయి. అందులో ప్రముఖంగా పదో తరగతి పరీక్షల పద్ధతి మార్పు. రెండేళ్ల క్రితం వరకు పది పరీక్షలను 11 రోజుల పాటు 11 పేపర్లు నిర్వహించేవారు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒత్తిడికి గురయ్యేవారు. ముఖ్యంగా పరీక్షలంటే విద్యార్థుల్లో ఆందోళన ఉండేది. ఈ ఒత్తిడిని అధిగమించేందుకు గత వైఎస్సార్ ప్రభుత్వం ఆరు సబ్జెక్టులు, ఏడు పేపర్లుగా మార్చింది. దీంతో విద్యార్థులపై కొంతమేర ఒత్తిడి తగ్గింది. ఈ ఏడాది అదే విధానాన్ని అనుసరించడంతో పాటు ప్రతి పరీక్షకూ ఒకరోజు విరామం ఇచ్చారు.

గుడిపాల: పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో హడావుడి, మానసిక ఒత్తిడి సాధారణం. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఒకింత పరీక్షే. గతంలో 11 రోజులు పరీక్షలు రాయాల్సి ఉండడంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. అయితే ప్రస్తుతం పదోతరగతి పరీక్షల్లో ఆరు సబ్జెక్టులు, ఏడు పేపర్ల విధానంతో విద్యార్థులపై ఒత్తిడి బాగా తగ్గింది. అలాగే పరీక్షకు పరీక్షకు మధ్య విరామం ప్రకటించింది. గత విద్యాసంవత్సరం మాదిరిగానే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా నిర్వహించనున్నారు. మండలంలో ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 301 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది పరీక్షలు రాయబోతున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



నరహరిపేట పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

గతంలో ఇలా..

పదోతరగతి పరీక్షలు చాలా సంవత్సరాల నుంచి 11 పేపర్లుగా నిర్వహించారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిషు, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కుల చొప్పున రెండు పేపర్ల ప్రకారం జరిగేవి. కరోనా ప్రభావంతో 2019–20, 2020–21 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను రద్దుచేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021–22 విద్యాసంవత్సరంలో 11 పేపర్లను 7 పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ఒక్కో పేపరుకు 100 మార్కుల చొప్పున, ఫిజిక్స్, బయాలజీ పేపర్లకు ఒక్కో పేపర్‌కు 50 మార్కులు చొప్పున నిర్దేశించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న విధానానికి స్వస్తి పలకడంతో విద్యార్థులకు భారం తప్పింది.

ఈ ఏడాది పరీక్షలు ఇలా..

2022–23 విద్యాసంవత్సరంలో పదిపరీక్షలను ఏడు పేపర్లుగా కుదించారు. ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులలో ఒకే ప్రశ్న పత్రాన్ని ఇచ్చారు. జవాబుపత్రం వేర్వేరు సమాధాన బుక్‌లెట్లలో రాయాలి. గత విద్యాసంవత్సరంలో మూల్యాంకనం చేసేందుకు వీలుగా రెండుపేపర్లు ఇచ్చేవారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి పరీక్షలపై ఉండే భయాన్ని పోగొడుతుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.


పదోతరగతి పరీక్షల షెడ్యూల్

ఒత్తిడి తగ్గి బాగా చదువుకోవచ్చు



ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి పరీక్షలు బాగా రాసే అవకాశాలు ఉన్నాయి. పరీక్షకు పరీక్షకు మధ్య సెలవు రావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఉపాధ్యాయులు, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, స్టడీ మెటీరియల్ అందజేయడం, అంశాల వారీగా తర్ఫీదు ఇస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. నూతన విధానం ద్వారా పరీక్షల సంఖ్య, విద్యార్థులపై భారం తగ్గుతుంది.

–గణపతి, ఎంఈఓ, గుడిపాల

అభ్యసనా సామర్థ్యాలను పెంచాలి

తవణంపల్లె: పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగు పరచాలని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. శనివారం మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన తవణంపల్లె, అరగొండ, తొడతరలో సీఆర్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ లేక నాలుగో శనివారం సీఆర్పీ సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యాప్రమాణాల పెంపు, పాఠశాలల్లో పిల్లల నమోదు, బడిబయట పిల్లలను బడిలో చేర్పించుట వంటి అంశాలపై ఉపాధ్యాయులకు ప్రత్యక్ష ప్రచారం ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, రీసోర్సుపర్సన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని గాంధీరోడ్డులో శనివారం స్టార్ హెల్త్, ఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 80 మంది ఈ శిబిరానికి హాజరయ్యారు. వారికి వైద్యులు చికిత్స చేసి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

ఐరాల: ఆధునిక జీవనశైలి కారణంగా పెరుగుతున్న మరణాలకు గుండెపోటు ఓ కారణమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పూతలపట్టు పీ.కొత్తకోట సీహెచ్‌సీ వైద్యాధికారులు కుమార్‌రాజా, వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కాణిపాకం పీహెచ్‌సీలో వైద్యాధికారులు స్వాతి సింధూర, రాజేశ్వరి ఆధ్వర్యంలో వారు ప్రజలకు గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛాతీలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండడం, గుండె దడ, స్పృహ కోల్పోవడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలన్నారు. అవి ప్రారంభమైన మొదటి గంటలోపై వైద్యులను సంప్రదించాలన్నారు. గుండెపోటు నుంచి అత్యవసరంగా కాపాడడానికి రూ.45వేలు విలువచేసే టెనెక్టేప్లేస్ సీహెచ్‌సీలో ఉచితంగా అందిస్తామన్నారు. రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టి ఉంటే ఈ మందు గడ్డను కరిగిస్తుందన్నారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టు గోపీనాథరెడ్డికి నివాళి


జర్నలిస్టు గోపీనాథరెడ్డి మృతికి సంతాపం తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

తవణంపల్లె: మండలంలోని తొడతరలో సీనియర్ జర్నలిస్టు గోపీనాథరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. శనివారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, చిత్తూరు ప్రెస్‌క్లబ్, తవణంపల్లె, బంగారపాళ్యం మండలాల ప్రెస్‌క్లబ్ నాయకులు, పలువురు జర్నలిస్టులు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఏపీయూడబ్ల్యూజే తరపున గోపీనాథరెడ్డికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే జర్నలిస్టు గోపీనాథరెడ్డికి పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథం, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జగన్నాథం, జీవన్‌కుమార్, పలువురు రిపోర్టర్లు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తనిఖీ


ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

ఐరాల: స్థానిక ఆర్‌ఎస్‌కే కేంద్రంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం ఏఓ వరలక్ష్మి తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ ఎలా చేస్తున్నారు ? సర్వర్ పనిచేస్తోందా ? ఓటీపీలు వస్తున్నాయా ? అని వీఏఏను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత భూమి గల రైతులకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్లు తెలిపారు. 2025–26 నుంచి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వడ్డీ లేని పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర రాయితీ పథకాలన్నీ ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదైన రైతులకు మాత్రమే వర్తిస్తాయన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వీఏఏల ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ నెల 26వ తేదీ గడువు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

ఏ.కొత్తకోటలో చిరుత సంచారం

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట లో చిరుత పులి సంచరిస్తున్నట్లు పశువుల కాపరులు శనివారం గుర్తించారు. ఏకొత్తకోటనుంచి అగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళ్లే మార్గంలో సంచరించినట్లు గుర్తులు అనవాళ్లు ఉన్నాయని తెలిపారు. అటువైపు వెళ్లేందుకు రైతులు, ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న చైతన్య

స్మార్ట్ మీటర్లు వద్దు

చిత్తూరు కార్పొరేషన్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును మానుకోవాలని విద్యుత్ వినియోగదారుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. శనివారం సంతపేటలో స్థానికులకు కరపత్రాలను అందజేసి, అనంతరం ఆయన మాట్లాడారు. ట్రూ అప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రీ–పెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు వద్దని ప్రచారం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లు, విద్యుత్ చార్జీల బాదుడును టీడీపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన విద్యుత్ హామీలను తీర్చాలన్నారు. ఒక రూపాయి విద్యుత్ చార్జీలను పెంచనని చెప్పి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్రజలపై భారం వేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో రేకుల షెడ్డును శుభ్రం చేస్తున్న సిబ్బంది


ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న రూరల్ ఈఈ సురేష్

కార్యాలయాల శుభ్రత

చిత్తూరు కార్పొరేషన్: స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. అందులో భాగంగా శనివారం ట్రాన్స్‌కో కార్యాలయాలను సిబ్బంది శుద్ధి చేశారు. స్థానిక గిరింపేటలోని ఎస్‌ఈ కార్యాలయం, గాంధీ రోడ్డు, పాత కలెక్టరేట్‌లోని అర్బన్, రూరల్ డివిజన్ కార్యాలయాల్లో చెత్తచెదారాలు తొలగించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు కృషి చేస్తామని ఈఈలు మునిచంద్ర, సురేష్ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఏఓ ప్రసన్నఆంజనేయులు, పీఓ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. పరిపూర్ణం

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ద్వాదశి హారతులతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకాలు చేసి, స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి పట్టణానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ దవనం భక్తవత్సలం ఆధ్వర్యంలో స్వామి వారికి ద్వాదశి హారతులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మండలంలోని పొంతనపల్లెకు చెందిన చిన్నప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివార్లను శాంతి ఉత్సవంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. దీనికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అడుగడుగునా హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న ఇరుజట్లు

బైరెడ్డిపల్లె: గంగజాతర సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వాలీబాల్ క్రీడాకారులు 25 జట్ల వరకు ఈ పోటీల్లో తలపడుతున్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వాలీబాల్ పోటీలను తిలకిస్తున్నారు. పూర్వ విద్యార్థులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

పుంగనూరు: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పుంగనూరు పట్టణం ప్రకాశం కాలనీలో నివాసం ఉన్న బాలాజీ, మోహన్ శనివారం సాయంత్రం కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్నారని సీఐ శ్రీనివాసులుకు సమాచారం అందింది. వెంటనే సీఐ తన సిబ్బందితో పుంగనూరు–ముళబాగల్ మార్గంలోని కట్టపై నిఘా ఉంచి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 143 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రికార్డులు లేని వాహనాలు సీజ్


షికారీ కాలనీలో రికార్డులు లేని బైక్‌లను సీజ్ చేసిన ఎస్‌ఐ

తవణంపల్లె: మండలంలోని షికారీ కాలనీలో రికార్డులు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం రాత్రి మండలంలోని షికారీ కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిలోని వస్తువులను నిశితంగా పరిశీలించారు. కొందరి వద్ద రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను గుర్తించారు. అందులో ఐదు బైక్‌లను సీజ్ చేశారు. సకాలంలో ద్విచక్ర వాహనాలకు సంబంధించిన రికార్డులను చూపించకపోతే వారిపై బైక్ చోరీ చేసినట్లు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రికార్డులు లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



తవణంపల్లె హైస్కూల్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు, గుడిపాలలో..

తవణంపల్లె: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ సుధాకర్, ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తవణంపల్లె హైస్కూల్లో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంఈఓలు ప్రేమలత, త్యాగరాజులు రెడ్డి, హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి, ఉపాధ్యాయులు హైస్కూల్ ఆవరణలో చీపురు పట్టి చెత్తను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో సీఆర్పీలు చిట్టిబాబు, గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యమని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు భార్గవ్, స్వరూప్, అఖిల్, షాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర ద్వారా పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పరిసరాలను శుభ్రంగా ఉంచి గ్రామాల్లో కూడా వారి ఇళ్ల వద్ద పరిశుభ్రంగా ఉండే విధంగా ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వారికి అవగాహన కల్పించాలన్నారు. తద్వారా రోగాలు రాకుండా నియంత్రించవచ్చని సూచించారు.